క్లుప్తంగా

ముమ్మరంగా రోడ్డు నిర్మాణ పనులు



నాగలదిన్నె- మంత్రాలయం తారు రోడ్డు వేస్తున్న దృశ్యం

నందవరం: మంత్రాలయం-నాగలదిన్నె రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రూ.18 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. నందవరం మండలం నాగలదిన్నె బ్రిడ్జి నుంచి 18 కి.మీ. పొడవునా మంత్రాలయం వరకు రోడ్డు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం 6 కి.మీ బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. రోడ్డు పనులతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్రైత సిద్ధాంత ధర్మ ప్రచారం



ధర్మ ప్రచారంలో కమిటీ ప్రతినిధులు

వెల్దుర్తి: శోభకృత్ ఉగాది పురస్కరించుకుని మండల పరిధిలోని బోయనపల్లెలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక ధర్మవరం కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత ధర్మ ప్రచారం జరిగింది. కమిటీ ప్రతినిధులు గ్రామస్తుల ఇళ్ల వద్దకు వెళ్లి భగవద్గీత గురించి, పండుగలు, సంప్రదాయాల గురించి వివరిస్తూ పలు ఆధ్యాత్మిక గ్రంథాలను పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రతినిధులు మద్దిలేటి, పరుశరాముడు, మనోహర్, వెంకట్, రాజశేఖర్, శివలక్ష్మి, అంజనమ్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



కూర్మ నారాయణస్వామిని దర్శించుకుంటున్న వెంకట శేషుబాబు

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మ నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం వినియోగదారుల కమిషన్ రాష్ట్ర సభ్యుడు వెంకట శేషుబాబు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టు ప్రదక్షిణ చేసి 9 పుట్టలకు పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు నరేష్, గ్రామస్తులు ఆయనకు స్వాగతం పలికారు. ఉత్తర దిశగా వెలసిన స్వయంభూ కూర్మ నారాయణస్వామిని దర్శించకోవడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

లోక్‌అదాలత్ సభ్యులుగా ఎంపిక





నాగభూషణ రెడ్డి, మహేశ్



రమేశ్‌బాబు

పత్తికొండటౌన్: పత్తికొండ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న ముగ్గురు సీనియర్ న్యాయవాదులు పి.నాగభూషణ రెడ్డి, బి.రమేష్ బాబు, హెచ్.మహేశ్‌లను లోక్‌అదాలత్ మెంబర్లుగా ఎంపిక చేస్తూ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలు జారీచేసింది. మండల న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించే లోక్‌అదాలత్‌లలో వీరు పాల్గొంటారు. రెండేళ్లపాటు ఈ పదవిలో ఉండి కక్షిదారులకు న్యాయసేవలు అందిస్తారు. లోక్‌అదాలత్ సభ్యులుగా ఎంపికైన న్యాయవాదులను బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున, మాజీ అధ్యక్షుడు మైరాముడు, సత్యనారాయణ, న్యాయవాదులు రంగస్వామి, ప్రసాద్ బాబు తదితరులు అభినందించారు.

22 నుంచి తిమ్మగురుడు స్వామి తిరునాల



తిమ్మగురుడు స్వామి దేవాలయం

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెర్వు గ్రామంలో వెలసిన భక్తుల ఆరాధ్య దైవం తిమ్మగురుడు స్వామి తిరునాలను ఈ నెల 22వ తేదీ నుంచి జరుపుకోనున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గ్రామం మధ్యలో ఉన్న కొండపై వెలసిన తిమ్మగురుడు స్వామికి బుధవారం ప్రతి ఇంటి నుంచి నేవైద్యం తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 23న ఉదయం స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రభపై ఉంచి ఊరేగింపు నిర్వహిస్తారని, సాయంత్రం స్వామివారి పల్లకీ సేవ ఉంటుందన్నారు. తిరునాల సంరద్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.

అందుబాటులో కంటి వైద్యం

- యాభై పడకల ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు
- 2022లో 361 మందికి చికిత్స
- ఈ ఏడాది ఇప్పటివరకు 165 మందికి ఆపరేషన్లు
- జిల్లాలో మొదటి, రాష్ట్రంలో మూడవ స్థానంలో ఎమ్మిగనూరు



ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాల

ఎమ్మిగనూరురూరల్: 'సర్వేంద్రియానం నయనం ప్రధానం' మనిషి దేహంలో అన్ని ఇంద్రియాల కంటే కళ్లు ప్రధానమైనవి. చూపు లేకపోతే వారి పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో ఊహించుకుంటేనే భయమేస్తుంది. కంటి చూపునకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని ఏపీ వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ వైద్యశాలలో మొట్టమొదటి సారిగా రోగులకు కంటి ఆపరేషన్లు చేసే సౌకర్యం కల్పించింది. వయస్సుతో నిమిత్తం లేకుండా చిన్న పిల్లల నుంచి పెద్ద వయస్సు వారి వరకు కంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. గతంలో కంటి చూపు మందగించిన వృద్ధులు, మహిళలు, యువకులు ఆపరేషన్ చేయించుకోవాలంటే కర్నూలు, రాయచూర్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడడమే గాక, డబ్బులు కూడా ఖర్చు చేసుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ఈ ఇబ్బందులు పడకుండా స్థానికంగానే ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. కమ్యూనిటీ వైద్యశాలకు ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, మంత్రాలయం, కోసిగి, పెద్దకడబూరు ప్రాంతాల నుంచి రోగులు వైద్యం కోసం వస్తుంటారు. కంటి బాధితులకు, కంటి శుక్లాలకు చికిత్స చేసి లెన్స్ అమరుస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో కంటి ఆపరేషన్లు చేస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

50 పడకల కమ్యూనిటీ వైద్యశాలలో ఆపరేషన్లు

గతంలో వంద పడకల ప్రభుత్వాసుపత్రుల్లో మాత్రమే కంటి ఆపరేషన్లు చేసేవారు. ఎమ్మిగనూరు కమ్యూనిటీ వైద్యశాలలో కంటి ఆపరేషన్లు చేస్తున్నారనే ప్రచారం ఇతర ప్రాంతాలకు వ్యాపించడంతో రోజురోజుకు ఆపరేషన్లు చేయించుకునేందుకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. 2022 సంవత్సరంలో 361 మంది ఆపరేషన్లు చేయించుకున్నారు. 2023 సంవత్సరం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 165 మందికి ఆపరేషన్లు చేశారు. రోగులకు సరిపడా బెడ్స్ లేకపోవటం, ప్రత్యేక గది లేకపోవడంతో ఆపరేషన్ల కోసం వచ్చే వారికీ తేదీలు నిర్ణయించి ఆ రోజుల్లో చేస్తున్నారు. పూర్తిస్థాయిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తే రోజూ నాలుగు నుంచి ఐదు మందికి ఆపరేషన్లు చేసే అవకాశం ఉంది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



కంటి ఆపరేషన్ చేస్తున్న డాక్టర్

రాష్ట్రంలోనే మూడవ స్థానం

యాభై పడకల ఏపీ వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ వైద్యశాలలో ఎక్కువ మందికి కంటి ఆపరేషన్లు చేయడం ద్వారా రాష్ట్రంలోనే మూడవ స్థానం, జిల్లాలో మొదటి స్థానంలో ఎమ్మిగనూరు నిలిచింది. ప్రతి నెలా 35 నుంచి 50 మందికి ఆపరేషన్లు చేస్తున్నారు. ఆపరేషన్లు చేసిన తరువాత ఉచితంగా కంటి అద్దాలను అందజేస్తున్నారు. ఆపరేషన్లు చేయించుకునే వారికి ప్రత్యేకించి గదులు ఏర్పాటు చేసి, వంద పడకలు చేస్తే ఆపరేషన్ల సంఖ్యను పెంచవచ్చు.

“ ఆపరేషన్లు చేయించుకునే వారి సంఖ్య పెరుగుతోంది



ప్రభుత్వాసుపత్రిలో ఆపరేషన్లు చేస్తుండటంతో రోజు రోజుకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. గదుల సమస్య ఉన్నా, ప్రస్తుతానికి ఉన్న వాటిలో సమస్య రాకుండా చూస్తున్నాం. కంటి ఆపరేషన్లు చేయించుకునేందుకు ఎక్కువ మంది వస్తే రోజు ఆపరేషన్లు చేస్తాం. యాభై పడకల కమ్యూనిటీ ఆస్పత్రుల్లో వైద్యం చేయడం ఇదే మొదటిసారి. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తైతే సమస్య ఉండదు. ఉచిత ఆపరేషన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. – డాక్టర్ చిరంజీవి, కంటి వైద్యుడు, ఎమ్మిగనూరు

అడిగిన వారందరికీ ఉపాధి పనులు

మద్దికెర: మండలంలో వ్యవసాయ కూలీలు వలసలు పోకుండా అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాయని ఏపీఓ రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం 2600 మంది ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. జాబ్ కార్డు వున్న ప్రతి కూలీకి పనులు కల్పించడం జరుగుతోందన్నారు. గ్రామాలలోని పొలాలలో పనులు కావాల్సిన రైతులు సంబంధిత ఉపాధి సిబ్బందితో కలిసి నమోదు చేయించుకోవాలని సూచించారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

తుగ్గలి: మండలంలో సోమవారం నుంచి 29వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ఎం బాషా తెలిపారు. 20వ తేదీన రాంపల్లి, జీఎర్రగుడి, 21న పెండేకల్లు, జీఎర్రగుడి, 27న మారెళ్ల, రాతన, 28న ముక్కెల్ల, రాతన, 29న బొందిమడుగుల, ఎద్దులదొడ్డిలో ఆధార్ నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రాల్లో ఆధార్ కార్డులో సవరణలు చేసుకోవడంతో పాటు, కొత్త ఆధార్ కార్డు పొందవచ్చన్నారు.

మెకానిక్‌కు ఆర్థిక సాయం

మద్దికెర: గత నెలలో జరిగిన అగ్ని ప్రమాదంలో షాపు పూర్తిగా కాలిపోవడంతో ఆసరా కోల్పోయిన మెకానిక్ నబీకి పత్తికొండ, మద్దికెర టూ వీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.25 వేలు ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ధర్మ, రాము మాట్లాడుతూ.. తోటి మెకానిక్‌లను ఆదుకోవడం కనీస ధర్మమన్నారు. అసోసియేషన్ వారు తమ వంతు సహకారం అందించడం అభినందించదగ్గ విషయమని, కొత్త షాపు పెట్టుకొని జీవనం సాగిస్తానని బాధితుడు తెలిపారు. సభ్యులు రసూల్, విక్రమ్, రమేష్, రంగస్వామి, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

హొళగుంద: ఈ నెల 22న జరిగే ఉగాది పండుగతో పాటు గ్రామంలో జరిగే సుంకులమ్మ జాతరను పురస్కరించుకుని పెద్దగోనెహాళ్ గ్రామ సర్పంచ్ కొత్తింటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఆయా వీధుల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టారు. డ్రైనేజీలలో మురుగునీరు, పూడికను తొలగించారు. దోమలు, వ్యాధులు ప్రబలకుండా వీధుల్లో చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. వీధుల్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయించారు. గ్రామస్తులు చెత్తచెదారాన్ని వీధుల్లో పారవేయకుండా శుభ్రత పాటించాలని సర్పంచ్ కోరారు.

ప్రమాదకరంగా లోలెవల్ వంతెనలు



బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న భారీ వాహనాలు (ఫైల్),



గుంతలు పడి అధ్వానంగా మారిన వేదావతి బ్రిడ్జి

హొళగుంద: ఆంధ్రా-కర్ణాటక రాష్ట్రాల మధ్య తిరుగుతున్న భారీ వాహనాలతో ఎల్లెల్సీ, వేదావతి (హగరి) నదిపై నిర్మించిన బ్రిడ్జిలు దెబ్బతింటున్నాయి. ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలకు రాకపోకలకు అనువుగా ఉన్న బ్రిడ్జిలకు భారీ వాహనాల వల్ల ముప్పు ఏర్పడుతోందని ప్రజలు వాపోతున్నారు. ఎల్లెల్సీపై 1947లో బ్రిడ్జి నిర్మించారు. బ్రిటీష్ కాలం నాటి బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. భారీ వాహనాలు వెళితే బ్రిడ్జి నుంచి శబ్దాలు వినిపిస్తున్నాయి. కంకర, సిమెంట్ నల్ల బండలు, ఇసుక లోడుతో హెవీ వాహనాలు తిరగడం వల్ల బ్రిడ్జిలు దెబ్బ తింటున్నాయి. ఎల్లెల్సీ బ్రిడ్జిపై దాదాపు 8 టన్నులు, వేదావతి (హగరి) బ్రిడ్జి 15 టన్నుల బరువున్న వాహనాల సామర్థ్యాన్ని తట్టుకునేలా నిర్మించారు. అయితే 30 టన్నులకు పైగా బరువున్న వాహనాలు తిరగడం వల్ల బ్రిడ్జిలు పటిష్టత కోల్పోతున్నాయి. ఇప్పటికే బ్రిడ్జిలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి బ్రిడ్జిలకు మరమ్మతులు చేపట్టడం లేదా కొత్తవి నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఎన్‌పీసీఐకు అనుసంధానం చేయించండి



మాట్లాడుతున్న ఏపీఓ మాలిక్‌బాషా

నందవరం: ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కు ఆధార్ కార్డుతో అనుసంధానం చేయించాలని ఏపీఓ మాలిక్‌బాషా ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో జాబ్ కార్డుకు ఆధార్, బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్‌పై టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 26,202 మంది ఉపాధి కూలీలు ఉన్నారని పేర్కొన్నారు. అందులో 26,017 మందికి జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం పూర్తి చేశామన్నారు. వీరిలో 23,856 మందికి బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ చేయించామన్నారు. మిగిలిన 2,161 మందికి ఉపాధి కూలీల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ పూర్తి చేసి ఎన్‌పీసీఐ లింక్ పూర్తి చేయాలని ఎఫ్ఏలకు సూచించారు. ఆధార్ అనుసంధానం, బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ పూర్తయితేనే ఉపాధి కూలీలు బ్యాంక్ ఖాతాలకు జమ అవుతాయని వివరించారు. పల్లెల్లో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించి ఆధార్ సీడింగ్, బ్యాంక్ లింకింగ్ చేయించాలన్నారు. అలాగే అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు 'స్పందన' కార్యక్రమం

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ పురుషోత్తం ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. ప్రజలు సమస్యలపై స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.

ప్రజా మద్దతు వైఎస్సార్‌సీపీకే

చిప్పగిరి: మూడు పట్టభద్రుల స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందినంత మాత్రాన రాష్ట్రం మొత్తం గెలిచినట్టు భ్రమపడుతున్నారని ఎంపీపీ జూటూరు హేమలత అన్నారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 14 ఎమ్మెల్సీ స్థానాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా 11 స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుందని, మూడు పట్టభద్రుల స్థానాల్లో టీడీపీ రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలిచి సంబరాలు చేసుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రజా మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందని, 2024 సాధారణ ఎన్నికల్లో టీడీపీ కనుమరుగు కావడం ఖాయమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మారయ్య, లాల్ స్వామి, తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

- 8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్
- రూ.26,500 నగదు స్వాధీనం, 7 సెల్‌ఫోన్లు సీజ్

వెల్దుర్తి: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామళ్లకోట టు కాల్వబుగ్గ రహదారిలో ఇసుక కొండ వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించారు. కొండ ప్రాంతంలో చెట్టు కింద కొంతకాలంగా ఏర్పాటు చేసుకున్న పేకాట స్థావరాన్ని పోలీసులు ముందుగా గుర్తించారు. పక్కా పథకం ప్రకారం స్థావరాన్ని ఆదివారం తెల్లవారుజాము నుంచే రౌండప్ చేసి, పొదలమాటున దాగి పేకాటరాయుళ్ల కోసం ఎదురు చూశారు. ఐదారు గంటల తరువాత స్థావరానికి చేరుకున్న వివిధ గ్రామాలకు చెందిన 8 మంది పేకాటలో మునిగిపోయారు. మరికొంత సమయం వేచిచూసిన పోలీసులు ఒక్కసారిగా మెరుపు దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ తెలిపిన వివరాల మేరకు అరెస్ట్ చేసిన వారిలో రామళ్లకోట వెంకటేశ్వర్లు, వెంకటేశ్, తారక్, రమేశ్, సతీష్, ఆత్మకూరు వెంకటరమణ, సిద్ధనగట్టు వెంకట్రాముడు, బేతంచెర్ల మహేంద్ర ఉన్నారు. వారి నుంచి పేక ముక్కలతోపాటు రూ.26,500 నగదు స్వాధీనం చేసుకుని, 7 సెల్ ఫోన్లు సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



చిన్నహ్యాట జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ ఆదినారాయణ

ఆలూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేసేలా ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ ఆదినారాయణ ఆదేశించారు. హొళగుంద మండలంలోని చిన్నహ్యాట, పెద్దహ్యాట, కోగిలతోట, హొళగుంద తదితర గ్రామాల్లో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న గృహాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ వచ్చే నెల 5వ తేదీ నాటికి గృహ ప్రవేశాలు చేయించేలా అధికారులు కృషి చేయాలన్నారు. గృహ నిర్మాణాల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లబ్ధిదారులను చైతన్యం చేసి గృహాలు వేగంగా నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని, గృహ నిర్మాణాల కోసం అవసరమైన సిమెంట్, ఇనుము తదితర సామగ్రిని ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. వివిధ దశలలో పూర్తయిన ఇళ్లకు సంబంధించి బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి




రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం ఇస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

పత్తికొండ రూరల్: బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగారి వెంకటరామరాజు అన్నారు. ఆదివారం పత్తికొండకు వచ్చిన ఆయనకు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీలక్ష్మివెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన్ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. బ్రాహ్మణుల శుభ, అశుభ కార్యక్రమాల నిర్వహణకు బ్రాహ్మణ భవన్ ఏర్పాటుచేయాలని కోరుతూ బ్రాహ్మణులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన ఆలయాల్లో అర్చకత్వం, పౌరోహిత్యం చేస్తున్న బ్రాహ్మణులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. బ్రాహ్మణ సంఘం నాయకులు డాక్టర్ గోపినాథ్, విశ్వం, జయదేవ్‌కశ్యప్, భాస్కర్, మైనంపాటి చంద్రశేఖర్, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలకు నవ్య శోభ

- ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రణాళికలు
- జిల్లాలో 13 గుడుల పునర్నిర్మాణానికి అనుమతులు
- రూ.11.43 కోట్ల నిధుల విడుదలకు పరిపాలనా అనుమతులు



పెరవలి రంగనాథ స్వామి ఆలయం



గద్దెరాళ్ల మారెమ్మ దేవాలయం

కర్నూలు కల్చరల్: జిల్లాలోని పలు ఆలయాలు నవ్య శోభను సంతరించుకోనున్నాయి. ఆయా దేవాలయాల జీర్ణోద్ధరణకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. జిల్లాలోని 13 దేవాలయాలకు సంబంధించి ఆధునికీకరణ, పునఃనిర్మాణ పనులు చేపట్టేందుకు దాదాపు రూ.11.43 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కింద రూ.9,53,50,000, మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ కింద 1,90,70,000 నిధులు ఉన్నాయి. ఈనిధులతో ఆలయాల రూపు మారి అధునాతనంగా దర్శనమివ్వనున్నాయి.

త్వరలోనే పునరుద్ధరణ పనులు ప్రారంభం



జిల్లాలోని 13 ఆలయాల్లో పునఃనిర్మాణ, ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు వచ్చాయి. త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు చేపడతాం. కామన్ గుడ్ ఫండ్‌తో పాటు ఆలయాల మ్యాజింగ్ గ్రాంట్ నిధులను కలుపుకొని నిర్మాణ పనులకు నిధులు వెచ్చిస్తాం. ఈ నిధులతో ఆలయాల రూపు రేఖలు మారతాయి. – ఆదిశేషు నాయుడు, సహాయ కమిషనర్, దేవదాయ శాఖ

పునరుద్ధరణకు కేటాయించిన నిధులు ఇలా..

- ఓర్వకల్ మండలం కన్నమడకల గ్రామం శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.40 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8 లక్షలు.
- ఓర్వకల్ మండలం నన్నూరు గ్రామంలోని శ్రీ లక్ష్మి సమేత మాధవ స్వామి ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.10 లక్షలు.
- కర్నూలు నగరం కన్నప్ప చౌల్ట్రీలోని శ్రీ సత్య నారాయణ స్వామి కల్యాణ మండపం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.75 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.15 లక్షలు.
- కర్నూలు కుమ్మరి వీధిలోని శ్రీ రాంబొట్ల దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలు.
- కర్నూలునగరంలోని శ్రీకోట ఆంజనేయ స్వామి ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలు.
- దేవనకొండ మండలం కప్పట్రాళ్లలోని శ్రీ కౌలుట్ల చెన్నకేశవ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1.20 కోట్లు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.24 లక్షలు.
- గద్దెరాళ్ల గ్రామం శ్రీ గద్దెరాళ్ల మారెమ్మ ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1.15 కోట్లు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.23 లక్షలు.
- ఆస్పరి మండలం శంకరబండ గ్రామంలోని శ్రీ మాధవస్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.43 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8.60 లక్షలు.
- మద్దికెర మండల పెరవళి గ్రామంలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలు.
- కోసిగి మండలం నేలకోసిగి గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.27.50 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.5.50 లక్షలు.
- కోసిగి మండలం జమ్ములదిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.50 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.10 లక్షలు.
- నందవరం మండలం కనకవీడు గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.43 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8.60 లక్షలు.
- ఎమ్మిగనూరు మండలం గార్లదిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.40 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8 లక్షలు మంజూరయ్యాయి.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలో మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు ఆస్పరి మఠంలో భక్తులకు అన్నదానం చేశారు.

22 నుంచి క్రికెట్ టోర్నీ

వెల్దుర్తి: రామళ్లకోటలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 22 నుంచి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. విన్నర్స్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు మధు, మనోజ్, రమణ, పార్థు, శ్రీను, మనోహర్, ఇదుర్ తెలిపారు. గ్రామ పెద్దలు, దాతల సహకారంతో జరుపబోయే టోర్నీలో పాల్గొనదలచిన వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 95530 53339, 98857 23721 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పత్తికొండ రూరల్: పత్తికొండ-ఎద్దులదొడ్డి రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పత్తికొండ నుంచి వెళ్తున్న ప్రవీణ్, ఎద్దులదొడ్డి నుంచి వస్తున్న సుధాకర్ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో ఇద్దరు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఇద్దరిని పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

హొళగుంద: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. కంప్యూటర్ ఆపరేటర్లు ఎన్నో ఏళ్లుగా పంచాయతీ కార్యాలయాల్లో చాలీచాలని జీతాలతో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వారి కుటుంబాల పోషణ కష్టంగా మారిందని, పనికి తగిన వేతనం అమలు చేయాలని కోరారు.

4న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): గిరి ప్రదక్షిణ దీపోత్సవం సందర్భంగా తమిళనాడులోని అరుణాచల క్షేత్రం దర్శనం సందర్భంగా ఏప్రిల్ 4వ తేదీన సూపర్ లగ్జరీ (హైటెక్) ప్రత్యేక బస్సు (సర్వీస్ నంబర్-93999)ను నడపనున్నట్లు కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మంగళవారం సాయంత్రం 6గంటలకు కర్నూలు నుంచి ఈ బస్సు బయలుదేరి, బుధవారం తెల్లవారుజామున 4:30గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు బస్సు తిరుగు ప్రయాణమై గురువారం ఉదయం 6 గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని వెల్లడించారు. రాకపోకల చార్జీ రూ.2 వేలు ఉంటుందని, వివరాలకు అసిస్టెంట్ మేనేజరు సెల్ 7382871131, 9959225794 (తన) నంబర్లను సంప్రదించాలని కోరారు.